
# రోడ్లపైనే మురుగు.. దోమల విజృంభణ

**శ్రీనగర్‌కాలనీలో అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ**

- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- మురుగు సమస్యతో తీవ్రంగా దోమల బెడద
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



నాగార్జుననగర్ కాలనీలో రోడ్లపై పొంగుతున్న డ్రైనేజీ



శ్రీనగర్‌కాలనీలో మట్టి తేలి అస్తవ్యస్తంగా తయారైన రోడ్డు



వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద పొంగుతున్న డ్రైనేజీ



నవోదయ కాలనీలో..

బంజారాహిల్స్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అసలే రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదనుకుంటుంటే.. మరోవైపు భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొంగుతున్న డ్రైనేజీ, గోతులు పడ్డ రోడ్లతో అవస్థలు పడుతున్నారు. రోడ్లపై మురుగు నీరు, చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీనగర్‌కాలనీలో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంది. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవాలయం వెనుక వైపు ఉన్న పార్కింగ్ స్థలం వద్ద డ్రైనేజీ నిత్యం పొంగుతూనే ఉంది. దీంతో మురుగు నీరు ఆలయ ప్రధాన గేటు వరకు వస్తోంది. దీనికి సమీపంలోని మీనాక్షి ఎన్‌క్లేవ్ వద్ద సైతం ఇదే పరిస్థితి నెలకొంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు ఇక్కడి రోడ్లను ముంచెత్తుతోంది. భక్తులు మురుగు నీటిలోనే దైవ దర్శనానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎల్లారెడ్డిగూడ ప్రధాన రోడ్డు, నవోదయకాలనీ, ఆర్‌బీఐ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఏ వీధి చూసినా మురుగు నీటి ప్రవాహమే కనిపిస్తోంది. శాలివాహననగర్‌కు వెళ్లే దారులన్నీ మురుగు నీటితో నిండి ఉంటున్నాయి. నాగార్జునగర్‌కాలనీలోని విజయ టవర్స్, రామకృష్ణ టవర్స్ ప్రాంతాలు మురికి కూపాన్ని తలపిస్తున్నాయి. రాత్రి సమయంలో మురుగు నీరు సరిగా కనిపించకపోవడంతో నడిచి వెళ్లే వారితో పాటు వాహనదారులు జారి కిందపడిపోతున్నారు. జలమండలి పారిశుధ్య విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. మురుగు, చెత్త కారణంగా దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ధ్వంసమైన రోడ్లు..**

శ్రీనగర్‌కాలనీ సత్యసాయి నిగమాగమంలో రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మట్టి దిబ్బలు తేలి, గోతులు పడి ఉండటంతో ప్రయాణానికి వీలు లేకుండా తయారయ్యాయి. ఇండియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న దారిలో కొద్ది రోజుల క్రితం డ్రైనేజీ పైప్‌లైన్ వేసి రోడ్డు వేయకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోతులు పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఎల్లారెడ్డిగూడ జలమండలి కార్యాలయం నుంచి గంగాధర్ భక్త సమాజ్ వరకు రోడ్డంతా కొట్టుకుపోయింది. గోతులు పడటంతో వాహనాలు నెమ్మదిగా ప్రయాణిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉమేష్‌చంద్ర సేవలు చిరస్మరణీయం



ఉమేష్‌చంద్ర విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు

అమీర్‌పేట, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టులపై ఉక్కుపాదం మోపడంతో పాటు అసాంఘిక శక్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మాజీ ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్‌చంద్ర మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అడిషనల్ డీజీ అంజనీకుమార్ అన్నారు. ఉమేష్‌చంద్ర 25వ వర్థంతి సందర్భంగా బుధవారం ఎస్‌ఆర్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజనీకుమార్ మాట్లాడుతూ.. మావోయిస్టులను అణచివేస్తున్నాడనే కారణంతో 1999 సెప్టెంబర్ 4న ఎస్‌ఆర్‌నగర్‌లో కారులో వెళ్తున్న ఉమేష్‌చంద్రపై నలుగురు నక్సలైట్లు కాల్పులు జరిపారన్నారు. దీంతో ఆయన బాడీగార్డ్, డ్రైవర్ మృతిచెందారని.. ఉమేష్‌చంద్ర కారుదిగి నక్సలైట్లను పట్టుకునే ప్రయత్నం చేయగా ఆయనపై కాల్పులు జరిపి చంపేశారని వెల్లడించారు. ఆయన మృతికి చిహ్నంగా 2000 సంవత్సరం సెప్టెంబర్ 4న ఎస్‌ఆర్‌నగర్ కూడలిలో విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ డీజీపీ గౌతం సవాంగ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి హాజరయ్యారు.



పార్టీ శ్రేణులతో కలిసి బీకేగూడలో పర్యటిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ

## వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అమీర్‌పేట, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమ సూచించారు. బుధవారం పార్టీ కార్యకర్తలతో కలిసి అమీర్‌పేట డివిజన్ బీకేగూడలో ఆమె పర్యటించారు. ఇక్కడున్న పార్కు ప్రాంతంలో కాలం చెల్లిన ఇనుప విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తాంభాలను ఏర్పాటు చేయించారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సురక్షితమైన వాతావరణం కల్పించడం, మౌలిక వసతులు కల్పించడంతో పాటు సమస్యలను పరిస్కరించడమే తన ప్రధాన లక్ష్యమని నీలిమ పేర్కొన్నారు. డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, డివిజన్ మహిళా అధ్యక్షులు రాజేశ్వరీ, మైనార్టీ అధ్యక్షులు అర్ఫతుద్దీన్, రజనీకాంత్, గోదాస్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పనులు త్వరగా ప్రారంభించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న సద్గుణరెడ్డి, శ్రీధర్‌రెడ్డి

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ డివిజన్‌లోని హేమవతి నగర్ బస్తీలో పైప్‌లైన్ నిర్మాణ పనులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నిధులు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో పనులు త్వరగా చేపట్టాలని కోరుతూ బుధవారం జలమండలి శాఖ ఎండీ అశోక్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్ సద్గుణరెడ్డి, ఎర్రగడ్డ డివిజన్ పార్టీ మాజీ అధ్యక్షులు గూడూరు శ్రీధర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హేమవతినగర్ బస్తీలో తాగునీటి పైప్‌లైన్‌లో డ్రైనేజీ లైన్లు కలిసి నీరు కలుషితమవుతుందన్నారు. దీంతో స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారని కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించి నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రేమకళ, దూడల సురేష్‌గౌడ్, సోమసుందర్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

## మీడియన్స్‌లో ప్రకటన బోర్డులు తొలగింపు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రహదారుల మధ్య ఖాళీ స్థలం(మీడియన్స్)లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ప్రకటనల బోర్డులను జీహెచ్‌ఎంసీ అధికారులు బుధవారం తొలగించారు. లిబర్టీలో ఏర్పాటు చేసిన సుమారు 60 ప్రకటనల బోర్డులు తొలగించారు. ఈ బోర్డులపై నగర మేయర్ విజయలక్ష్మి ఫోటో ఉండటం గమనార్హం. అయితే మాసబ్‌ట్యాంక్ మెయిన్ రోడ్, కేబీఆర్ పార్క్ చుట్టూ ఏర్పాటు చేసిన బోర్డులను మాత్రం తొలగించలేదు.



కార్పొరేటర్ దేదీప్యకు సమస్యలు వివరిస్తున్న వెంకటేశ్వరరావు

## సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌కు వినతి

వెంగళరావునగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వెంగళరావునగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు కార్పొరేటర్ దేదీప్యను కోరారు. కొత్తగా ఎన్నికైన సమితి ప్రతినిధులు బుధవారం స్థానిక కార్పొరేటర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి సమస్యలను వివరించారు. ఏ, డీ బ్లాక్ పార్కుల్లో క్రీడా పరికరాలు దెబ్బతిన్నాయని, డీ-71 నుంచి డీ-181 వరకు.. సాయిబాబా దేవాలయం వీధిలో, మీసేవ రహదారిలో, ఏ- టైప్ పార్క్ చుట్టూ రహదారులు దెబ్బతిన్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. తరుచూ కరెంట్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, విద్యుత్ తీగల స్థానంలో బంచ్ కేబుల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల చుట్టూ వర్షం నీరు నిలిచిపోయి స్థానికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రహదారి ఎత్తు పెంచి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సమితి ఉపాధ్యక్షులు పీహెచ్‌ఎన్ ప్రసాద్, అర్జున్, ప్రధాన కార్యదర్శి పీఎస్ రాజు, కోశాధికారి రాజశేఖర్, సంయుక్త కార్యదర్శి ధనుంజయరెడ్డి, సభ్యులు సునీత, తిరుమలేష్, శ్రీధర్, శ్రీనివాస్, సంజయ్‌రావు, సంతోష్, చారి ఉన్నారు.

## ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తూ విజయోత్సవ సభ

బంజారాహిల్స్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూ నారాయణపేటలో విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇటుక రాజు అన్నారు. బుధవారం జూబ్లీహిల్స్‌లో ఆయన విజయోత్సవ సభ గోడ పత్రిక, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం చాలా కాలంగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందన్నారు. దళితుల కల నెరవేరిన నేపథ్యంలో ఈ నెల 21న నారాయణపేటలోని సూర్య కన్వెన్షన్‌లో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సభలో 57 ఉపకులాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చింతలరాజలింగం, సిరిసిల్ల బాలరాజు పాల్గొన్నారు.



పాఠశాలకు రంగులు వేసిన వారితో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

## ప్రభుత్వ పాఠశాలకు రంగులు

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు వచ్చిన వెల్స్ ఫార్గో సంస్థ ఉద్యోగులు గోడలకు రంగులు వేస్తామని ప్రిన్సిపాల్‌కు చెప్పారు. ఆయన అంగీకరించడంతో పాఠశాల గోడలన్నింటికీ రంగులు వేశారు. భారతదేశ చిత్రపటంతో పాటు ప్రముఖ నాయకులు, తదితర చిత్రాలతో సుందరంగా మార్చేశారు. తరగతి గదుల్లోని బ్లాక్ బోర్డులకు సైతం రంగులేసి కొత్తగా ఉండేలా తీర్చిదిద్దారు. స్థానిక కార్పొరేటర్ సీఎన్ రెడ్డి వారిని అభినందించారు. ఆయన కూడా బ్రష్ పట్టుకుని గోడలకు పెయింటింగ్ వేశారు.

## యాదవ కుటుంబంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పంజాగుట్ట, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గానికి చెందిన కుటుంబంపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని యాదవ హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. బాధిత కుటుంబానికి న్యాయం చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని సమితి జాతీయ అధ్యక్షుడు మేకల రాములుయాదవ్ హెచ్చరించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితురాలు మండి బసమ్మతో కలిసి ఆయన మాట్లాడారు. కొడంగల్ నియోజకవర్గం మద్దూరు మండలం చింతల్ దిన్నె గ్రామానికి చెందిన బసమ్మ, భీమప్పయాదవ్‌ల ఇంటి పక్కనున్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించేందుకు అదే గ్రామానికి చెందిన పల్లె చిన్న హనిమిరెడ్డి, పల్లె వెంకటరెడ్డి, బుగ్గారెడ్డి, పల్లె రాజశేఖర్‌రెడ్డి, పల్లె రాజిరెడ్డి, పల్లె విష్ణువర్ధన్‌రెడ్డి ప్రయత్నించారని.. వారిని ప్రశ్నించిన భీమప్ప, బసమ్మ కుటుంబంపై దాడి చేశారని చెప్పారు. జవాన్‌గా పనిచేస్తున్న వారి కుమారుడు శ్రీనివాస్‌యాదవ్‌పై సైతం దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడని వెల్లడించారు. సీఎం సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆవేదన ఆయన ఆరోపించారు.

## మార్క్స్, అంబేడ్కర్ భావాలు ఒక్కటే

- ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ మాధవరావు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాధవరావు తదితరులు

రాంనగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలు పరిష్కరించడంలో మార్క్స్, డా బీఆర్ అంబేడ్కర్ భావాలు ఒక్కటేనని ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు అన్నారు. యువత మార్క్స్, అంబేడ్కర్‌లను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బుధవారం తెలంగాణ ప్రజా సాంస్కృతిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత జి.రాములు రచించిన 'లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఈ పుస్తకంలో అనేక మంది ప్రముఖులకు సంబంధించిన స్ఫూర్తిదాయక విషయాలను ప్రస్తావించడం అభినందనీయమన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, జస్టిస్ బి.చంద్రకుమార్, సీపీఎం నాయకుడు ఎస్.వీరయ్య, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్‌పాల్గొన్నారు.

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసిన పద్మావతి



గవర్నర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న పద్మావతి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ అవార్డుగ్రహీత, కళాకారిణి డాక్టర్ పద్మావతి బుధవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను సత్కరించారు. అనంతరం పద్మావతి మాట్లాడుతూ.. నవంబర్‌లో జరగబోయే పద్మావతి ఇనిస్టిట్యూట్ ఫర్ డిసేబుల్డ్ సంస్థ రజతోత్సవాలను హాజరుకావాలని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఆహ్వానించామన్నారు. దివ్యాంగ కళాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని, వారికి రూ.25 వేల పెన్షన్ ఇవ్వడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాల్లో అవకాశాలు కల్పించాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు.

## రాష్ట్రంలో క్రీడలకు పెద్దపీట: శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాట్స్ చైర్మన్ శివసేనారెడ్డికి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యలకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ.. రాబోయే నూతన స్పోర్ట్స్ పాలసీలో పారా స్పోర్ట్స్‌ను చేర్చుతామన్నారు. త్వరలోనే అధికారికంగా పారా స్పోర్ట్స్ కార్యాలయం ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక అధికారిని నియమించనున్నట్లు తెలిపారు. పారాఒలంపిక్స్‌లో రాణించిన జీవన్‌జీ దీప్తి దేశానికి గర్వకారణమన్నారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు సింగారపు బాబు, ప్రధాన కార్యదర్శి డిపల్లి ప్రశాంత్, సలహాదారు సంజీవయ్య పాల్గొన్నారు.



బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి, టీం విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్, వైద్య శిబిరం నిర్వహించారు. పలు విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

- బంజారాహిల్స్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి)

## మహిళకు తెలియకుండా ఖాతా నుంచి రూ.11 లక్షలు బదిలీ

యూసుఫ్‌గూడ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): తనకు తెలియకుండా తన ఖాతా నుంచి నగదు బదిలీ చేసుకున్న వారిపై ఓ మహిళ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మధురానగర్‌కు చెందిన డి.వనజ వ్యాపారం చేసుకుంటుంది. ఆమెకు చెందిన కొటక్ మహీంద్రాబ్యాంక్ ఖాతాలో రూ.11.50 లక్షలు ఉండగా, ఈ నెల 2న రూ.11 లక్షల నగదు వినోదరెడ్డి అనే మహిళ ఖాతాకు బదిలీ అయినట్లు మెసేజ్ వచ్చింది. బ్యాంక్‌కు వెళ్లి అడగ్గా డబ్బులు బదిలీ అయినట్లు చెప్పారు. దీంతో వినోదరెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వనజ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యాపారం పేరుతో భారీగా డబ్బు, నగలు తీసుకుని పరార్

యూసుఫ్‌గూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యాపారం పేరుతో మహిళ వద్ద డబ్బుతో పాటు నగలు తీసుకుని మోసం చేసిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎల్లారెడ్డిగూడలో నివసిస్తున్న పల్లె సరితకు అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న మధుసూదన్‌రావుతో పరిచయం ఏర్పడింది. తాను జ్యోతిష్యం చెబుతానని, తనకు పలు వ్యాపారాలు ఉన్నాయని నమ్మించాడు. ఓఆర్‌ఎస్ వ్యాపారంలో పెట్టుబడి పెడితే మంచి ఆదాయం వస్తుందని చెప్పాడు. లక్ష రూపాయలకు నెలకు రూ.10 వేల ఆదాయం వస్తుందని చెప్పడంతో సరిత రూ.2 లక్షల నగదు ఇచ్చింది. ఆ డబ్బు తిరిగి ఇవ్వకుండానే విశాఖపట్నంలో ఫ్లాట్ కొనుగోలు చేస్తున్నానని మరో రూ.2 లక్షలు తీసుకున్నాడు. తర్వాత సరితకు డబుల్‌బెడ్ రూమ్ ఫ్లాట్ ఇప్పిస్తానని చెప్పి మరో రూ.4 లక్షలతో పాటు నగలు తీసుకున్నాడు. అయితే ఎలాంటి ఫలితం లేకపోవడంతో మధుసూదన్‌రావును నిలదీయగా అతడితో పాటు ఉంటున్న సుమాంజలి, సంతోష్‌కుమార్, రాజేష్ ఆమెకు సర్దిచెప్పి నమ్మించారు. ఈ క్రమంలో జూలై 26న ఇంటికి తాళం వేసి వారు వెళ్లిపోయారు. ఆమె ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్విచ్‌ఆఫ్ వస్తోంది. దీంతో మోసపోయానని గ్రహించిన సరిత మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## విద్యుదాఘాతంతో యువకుడు మృతి

అమీర్‌పేట, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగలడంతో యువకుడు మృతి చెందిన ఘటన అమీర్‌పేటలోని అమోఘ టిఫిన్ సెంటర్‌లో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన వికాస్, నితీష్, అమిత్‌పాశ్వాన్(23) అనే ముగ్గురు అన్నదమ్ములు అమోఘ టిఫిన్ సెంటర్‌లో 18 నెలలుగా పని చేస్తున్నారు. బుధవారం ఉదయం అమిత్‌పాశ్వాన్ గ్రైండర్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతడు మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు హోటల్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

బోరబండ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): దంపతులు రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో భార్య అక్కడికక్కడే మృతిచెందిన ఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీహెచ్ భాస్కర్ తన భార్య నాగవల్లి(25), కూతురు లక్షితతో కలిసి బుధవారం ఊరి నుంచి వచ్చి ఎర్రగడ్డ గోకుల్ థియేటర్ వద్ద బస్సు దిగారు. సనత్‌నగర్ వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా ఎస్‌ఆర్‌నగర్ నుంచి వస్తున్న కారు వారిని ఢీకొట్టింది. దీంతో నాగవల్లి అక్కడికక్కడే మృతిచెందగా.. భర్త, కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



గణేశ్ విగ్రహాలు తరలివెళ్లే దారులను పరిశీలిస్తున్న డీసీపీ రాహుల్ హెగ్డే, ఏసీపీ హరిప్రసాద్

## గణేశ్ విగ్రహాల ఊరేగింపు సాఫీగా జరిగేలా చర్యలు

బంజారాహిల్స్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): వినాయక విగ్రహాల తరలింపులో ఎటువంటి అడ్డంకి లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని పశ్చిమ మండల ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే అన్నారు. పంజాగుట్ట డివిజన్ పరిధిలో వినాయక విగ్రహాల తరలింపు దారులను ఆయన ఏసీపీ కట్టా హరిప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, శ్రీనగర్‌కాలనీ దారులను పరిశీలించారు. కొన్నిచోట్ల విగ్రహాల తరలింపులో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సూచించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను గుర్తించి ట్రాన్స్‌కో సహాయంతో సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. భారీ విగ్రహాలు ఉంటే మెట్రో పిల్లర్లు లేని మార్గంలో వెళ్లాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భారీ వినాయకుడిని ఏర్పాటు చేయడంతో భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని.. అలాంటి ప్రాంతాల్లో అక్రమ పార్కింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో పోలీస్ సిబ్బందిని నియమించాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ విభాగాల సమన్వయంతో వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

**విత్తనాలతో చేసిన గణేశ్ విగ్రహాల పంపిణీ..**

పర్యావరణహిత వినాయకచవితిని నిర్వహించేందుకు ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్ విక్రయదారులు, రిఫైనర్స్ జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా) విత్తన గణపతుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. 10,000 విత్తన వినాయకుల పంపిణీ డ్రైవ్‌ను బుధవారం ఫ్రీడమ్ హెల్తీ ఆయిల్ మార్కెటింగ్ డీజీఎం చేతన్‌పింపాల్‌ఖుటే ప్రారంభించారు. హైదరాబాద్‌లో 7 వేలు, బెంగళూరులో 3 వేల విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన చెప్పారు. రెయిన్‌బో విస్టా, మలేషియా టౌన్‌షిప్, అపర్ణ సరోవర్, ఎన్‌సీసీ అర్బన్ మాదాపూర్, స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్, మూసాపేట, రిడ్జ్ టవర్స్, మై హోమ్ జువెల్ తదితర ప్రాంతాల్లో పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు.

**ఖైరతాబాద్ మండపం ప్రాంగణంలో..**

ఖైరతాబాద్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. బుధవారం ఆమె బీజేపీ నాయకురాలు వీణామధురి, స్థానిక నాయకులతో కలిసి ఖైరతాబాద్ గణపతి ప్రాంగణంలో మట్టి గణేశ్ విగ్రహాలను పంపిణీ చేశారు. జీహెచ్‌ఎంసీ ద్వారా పలు ప్రాంతాల్లో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.

**మట్టి గణపతుల పంపిణీ**



అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్ హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంలో బుధవారం మట్టి గణేశ్ ప్రతిమలను పంపిణీ చేస్తున్న కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

- (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)



కేబీఆర్ పార్క్‌వద్ద పీపీపీ పద్ధతిలో చేపట్టబోయే మల్టీలెవల్ పార్కింగ్ స్థలాన్ని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్టాండింగ్ కమిటీ సభ్యులతో కలిసి బుధవారం పరిశీలించారు. కాగా, ఆగస్ట్ 22న జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

- హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్, కంటోన్మెంట్, వాటర్ బోర్డు అధికారులు

## కంటోన్మెంట్ బోర్డుకు అదనపు నీటి సరఫరా

- ఒక ఎంజీడీ నీరు సరఫరా చేయాలని నిర్ణయం: వాటర్ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):** కంటోన్మెంట్ బోర్డుకు అదనంగా 1 ఎంజీడీల నీరు కేటాయించినట్లు వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే గణేష్, కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులతో బుధవారం సమావేశమయ్యారు. కొంతకాలంగా కంటోన్మెంట్ ప్రాంతానికి సరిపడా నీరు సరఫరా కావడం లేదనే విషయాన్ని ఎమ్మెల్యే.. సీఎం దృష్టికి తీసుకువెళ్లి అదనపు నీటి సరఫరాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యేతో ఎండీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ, కంటోన్మెంట్ బోర్డు పరిధిలో 40 వేల నల్లా కనెక్షన్లు ఉన్నాయని, వీరికి ప్రస్తుతం 5.9 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న నీరు కాకుండా అదనంగా ఇంకో ఎంజీడీ నీటిని సరఫరా చేసేందుకు సిద్ధమన్నారు. దీంతో ఇక నుంచి కంటోన్మెంట్ ప్రాంతానికి మొత్తం 6.9 ఎంజీడీల నీరు వాటర్‌బోర్డు సరఫరా చేస్తుందన్నారు.



జలమండలి మేనేజర్ వరుణ్‌రాజ్‌ను సత్కరిస్తున్న బీదలబస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నందారం సీతారాం తదితరులు

## బీదల బస్తీలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

**బౌద్ధనగర్, సెప్టెంబర్4(ఆంధ్రజ్యోతి):** బీదలబస్తీలో నెలకొన్న డ్రైనేజీ, కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని సీతాఫల్‌మండి జలమండలి మేనేజర్ వరుణ్‌రాజ్‌ను బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నందారం సీతారాం కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వరుణ్‌రాజ్‌ను బుధవారం సీతాఫల్‌మండి కార్యాలయంలో బీదలబస్తీ సంక్షేమ సంఘం సభ్యులతో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా బస్తీలో ఉన్న సమస్యలను ఆయనకు వివరించారు. దీంతో మేనేజర్ వరుణ్‌రాజ్ బీదల బస్తీలో పర్యటించి మ్యాన్‌హోళ్లను పరిశీలించారు. బస్తీలోని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బస్తీవాసులు గోవింద్, మొగలయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

**బౌద్ధనగర్, సెప్టెంబర్4(ఆంధ్రజ్యోతి):** గణపతి నవ రాత్రోత్సవాల సందర్భంగా బుధవారం నామాలగుండు మున్సిపల్ వార్డు కార్యాలయంలో సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ స్థానికులకు మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు నామాలగుండు జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో మట్టి గణపతులను పంపిణీ చేస్తామని, భక్తులు వచ్చి తీసుకెళ్లాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టిగణపతులను పూజించాలని ఆమె సూచించారు. అనంతరం ఆయా విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాలను సందర్శించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూసీడీ అధికారిణి ధనశ్రీ, ఆర్పీలు లక్ష్మి, సులోచన తదితరులు పాల్గొన్నారు.



ఓ చిన్నారికి మట్టి గణపతి విగ్రహాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

## గణేశ్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించాలి

**చిలకలగూడ, సెప్టెంబర్4(ఆంధ్రజ్యోతి):** వినాయక నవరాత్రులు ప్రశాంత వాతావరణంలో నిర్వహించటానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత తెలిపారు. వార్డు కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో కార్పొరేటర్ సమావేశం నిర్వహించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, శాంతి భద్రతల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై గుంతలు పూడ్చాలన్నారు. గణేశ్ నిమజ్జనానికి ఎటుంటి ఆటంకాలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కార్పొరేటర్ సునీత సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సునీత

## ఉమేష్‌చంద్ర మరణం పోలీస్ శాఖకు తీరనిలోటు

**అమీర్‌పేట, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):** మావోయిస్టులపై ఉక్కుపాదం మోపడంతో పాటు అసాంఘిక శక్తుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన మాజీ ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేషచంద్ర మరణం పోలీస్ శాఖకు తీరని లోటని అడిషనల్ డీజీ అంజనీకుమార్ అన్నారు. ఉమేష్‌చంద్ర 25వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఎస్ఆర్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజనీకుమార్ మాట్లాడుతూ.. మావోయిస్టులను అణచివేస్తున్నాడనే కారణంతో 1999 సెప్టెంబర్ 4న ఎస్ఆర్‌నగర్‌లో కారులో వెళ్తున్న ఉమేష్‌చంద్రపై నలుగురు నక్సలైట్లు కాల్పులు జరిపారన్నారు. దీంతో ఆయన బాడీగార్డ్, డ్రైవర్ మృతిచెందారని.. ఉమేష్‌చంద్ర కారుదిగి నక్సలైట్లను పట్టుకునే ప్రయత్నం చేయగా ఆయనపై కాల్పులు జరిపి చంపేశారని వెల్లడించారు. ఆయన మృతికి చిహ్నంగా 2000 సంవత్సరం సెప్టెంబర్ 4న ఎస్ఆర్‌నగర్ కూడలిలో విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మాజీ డీజీపీ గౌతం సవాంగ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి హాజరయ్యారు.



ఉమేష్‌చంద్ర విగ్రహానికి నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు



అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్ హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయంలో బుధవారం మట్టి గణేష్ ప్రతిమలను పంపిణీ చేస్తున్న కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, అధికారులు. -(హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

# పడకేసిన పారిశుధ్యం

## వర్షాల వల్ల ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తకుప్పలు

- రోడ్లపై మురుగునీటి నిల్వలు.. కంపుకొడుతున్న పరిసరాలు
- అంటువ్యాధుల బారిన పడతామని జనం ఆందోళన
- ఇదీ బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని పరిస్థితి



సోమప్పమఠం రోడ్డులో చెత్తకుప్పలు

**పద్మారావునగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):** నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఎక్కడికక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయాయి. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని చాచానెహ్రూనగర్, మేకలమండి ఎదురు రోడ్డు, ఐడీహెచ్ కాలనీ, భోలక్‌పూర్‌కమాన్ వంటి అనేక ప్రాంతాలలో చెత్తకుప్పలు పేరుకుపోయి పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. ముఖ్యంగా సోమప్పమఠం రోడ్డులో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కవాడిగూడ ప్రధాన దారికి ఆనుకుని ఉన్న అంతర్గత రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒక వైపు చెత్త కుప్పలు... మరోవైపు శిథిలావస్థకు చేరిన పబ్లిక్ టాయిలెట్స్.. మురికినీటి నిల్వలతో పరిసరాలు అధ్వానంగా మారాయి. ఆ దారిలో వెళ్లే వాహనదారులు, పాదచారులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. అసలే డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గునియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో చెత్త కుప్పలు, మురికినీటి నిల్వల కారణంగా దోమల ఉత్పత్తి గణనీయంగా పెరిగి అంటు వ్యాధులు పెరిగే అవకాశం లేకపోలేదు. ఎప్పటి కప్పుడు చెత్తకుప్పలను తొలగిస్తున్నప్పటికీ రోడ్లపై చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయని పారిశుధ్య సిబ్బంది తెలిపారు. బహిరంగ ప్రదేశాలలో చెత్తను వేస్తే జరిమానా విధిస్తామని పలు చోట్ల జీహెచ్ఎంసీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినప్పటికీ మార్పు కనపడటంలేదని తెలిపారు.ఇప్పటికైనా జీహెచ్ఎంసీ పారిశుధ్య, ఎంటమాలజీ అధికారులు, సిబ్బంది సమన్వయతో పారిశుధ్య సమస్యలను పరిష్కరించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.



చాచా నెహ్రూనగర్ రోడ్డులో చెత్త,మురికి నీరు

### పబ్లిక్ టాయిలెట్స్‌ను తొలగించాలి..



కవాడిగుడా ప్రధాన దారిలోని మిఠాయి భండార్ ఎదురు అంతర్గత రోడ్డులో శిథిలావస్థకు చేరిన పబ్లిక్ టాయిలెట్స్ కారణంగా పరిసరాలు పూర్తిగా చెత్తకుప్పలు, మురికినీటి నిల్వల మయంగా మారాయి. సంబంధిత అధికారులు శిథిలావస్థకు చేరిన టాయిలెట్స్‌ను తొలగించడం లేదా.. వాటి స్థానంలో నూతన టాయిలెట్స్‌ను ఏర్పాటుచేసి పరిసరాలను శుభ్రపర్చాలి.

- బి.కృష్ణ, సోమప్పమఠం, బన్సీలాల్‌పేట్

### పారిశుధ్య నిర్వహణ లోపంతో ప్రజలకు అనారోగ్యం



రోడ్డపై చెత్తను తొలగించక పోవడం, మురికినీటి నిల్వల కారణంగా దోమలు విపరీతంగా ఉత్పత్తి అయి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటుగా బస్తీలు, కాలనీలలో దోమల నివారణకు ఫాగింగ్, మురికినీటి నిల్వల వద్ద రసాయనాలను స్ప్రే చేయాలి. సిబ్బంది పనితీరును అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి.

- ఆర్.కృష్ణ, సోమప్పమఠం, బన్సీలాల్‌పేట్

## మనిషిలో జ్ఞానాన్ని సృష్టించే బ్రహ్మ ఉపాధ్యాయుడు

**బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి):** ప్రతి మనిషిలో జ్ఞానాన్ని సృష్టించే బ్రహ్మ ఉపాధ్యాయుడని, మనిషి మనిషిగా తీర్చిదిద్దే మహనీయులు ఉపాధ్యాయులని హైదరాబాద్ జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ అమర్నాథ్ అన్నారు. ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ సహకారంతో లయన్స్ క్లబ్ హైదరాబాద్ జిల్లా కో-ఆర్డినేటర్ నారాయణ ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం ఆడిటోరియంలో సుమారు 54 మంది టీచర్లకు బుధవారం ఉచితంగా టీచర్ ట్రైనింగ్ వర్క్‌షాపు నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా లయన్స్ క్లబ్ మొదటి గవర్నర్ అమర్నాథ్ హైదరాబాద్ జిల్లా లయన్స్ క్లబ్ రెండవ గవర్నర్ డీఆర్ విజయలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరై వర్క్ షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ, సమాజంలో అత్యున్నత స్థానం ఉపాధ్యాయులదేనన్నారు. ఉపాధ్యాయుడు విద్యార్థుల జీవితాలను మార్చగల శక్తివంతమైన వ్యక్తి అన్నారు. అందుకే ఉపాధ్యాయుల ప్రవర్తన, వారి పాత్ర మంచిగా ఉండడానికే ఈ వర్క్‌షాపు అని అన్నారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ, ఉపాధ్యాయుడు కేవలం జ్ఞానాన్ని ఇచ్చే వ్యక్తి కాదని, ప్రపంచానికి ఆదర్శవంతమైన మార్గదర్శకుడని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు టీచర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, పలువురు సంఘ సేవకులు లక్ష్మణ్, నాగేందర్, సురేష్ రావు తదితరులు పాల్గొన్నారు.




టీచర్స్ ట్రైనింగ్ వర్క్‌షాపులో మాట్లాడుతున్న హైదరాబాద్ జిలా లయన్స్ క్లబ్ జిల్లా కో-ఆర్డినేటర్ నారాయణ

## నాలాను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**తిరుమలగిరి సెప్టెంబర్ 4 (ఆంధ్ర జ్యోతి):** తిరుమలగిరి ఆర్టీసీ కాలనీ సమీపంలోని జయలక్ష్మి గార్డెన్స్ వద్ద గల నాలాను బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. తిరుమలగిరి నాలాపై ఉన్న రోడ్డుతో పాటు స్లాబ్‌ను ఎవరు నిర్మించారు, ఎప్పుడు నిర్మించారనే కోణంలో జయలక్ష్మి గార్డెన్ యజమాని రాఘవ రెడ్డిని అడిగారు. అలాగే వాటిపై ఉన్న నిర్మాణాలను ఎవరూ చేశారనేది కూడా తెలుసుకున్నారు. సర్వే నెంబర్ 104లో నాలా ఉన్నటు గుర్తించిన కమిషనర్ రంగనాథ్.. జయలక్ష్మి గార్డెన్ నుంచి హస్మత్‌పేట్ చెరువులోకి వెళుతున్న నాలాపై నిర్మాణాలను ఎలా చేశారనేది కూడా తెలుసుకున్నారు. ఆర్ఎఫ్ఓ పాపయ్య, డీసీపీ రామ్ రెడ్డి, ఏఈ రోహిత్‌తో కలిసి పర్యటించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ వారి ద్వారా నాలాకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారుల ఫిర్యాదుతోనే హైడ్రా కమిషనర్ ఈ పర్యటన చేపట్టినట్టు సమాచారం. అక్రమ నిర్మాణాలపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని హైడ్రా కమిషనర్ అన్నట్టు తెలిసింది.



నాలా ను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

## బొల్లారంలో వర్షానికి కూలిన ఇల్లు

- సాయం కోసం వృద్ధురాలి ఎదురు చూపులు

**తిరుమలగిరి సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):** ఎడతెరుపు లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు బొల్లారం ప్రాంతంలో పలు ఇళ్లు ధ్వంసం కాగా, చెట్లు కూడా నేల కూలాయి. ఇలా ఉండగా, సోమవారం అర్ధ రాత్రి కురిసిన భారీ వర్షానికి బొల్లారం లోని సిలోన్ బస్తీలో ఇళ్లు కూలింది. ఇల్లు కూలుతున్న శబ్దం రావడంతో అందులో నిద్రపోతున్న వృద్ధురాలు దేవమ్మ భయాందోళనతో బయటకి పరుగులు తీసింది. ఆమె కళ్ల ముందే ఇళ్లు కూలిపోయింది. ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులన్నీ మట్టి పెల్లల కింద కూరుకుపోయాయి. రెవెన్యూ అధికారులు తనకు సాయం చేయాలని బాధితురాలు కోరుతోంది. విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కేజ నరసింహన్ కన్నన్ కూలిపోయిన ఇంటిని పరిశీలించారు. ప్రభుత్వం నుంచి వచ్చే సహాయంతో పాటు తాను కూడా సాయం చేస్తానని దేవమ్మకు భరోసా ఇచ్చారు. అదేవిధంగా చింతల్ బజార్ లోని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవీ బాల్‌రాజ్ ఇంట్లోకి వర్షం నీరు చేరింది. దీంతో ఆయన కుటుంబ సభ్యులు కంటి మీద కునుకు లేకుండా బిక్కు బిక్కు మంటూ గడిపారు. ఎన్నోసార్లు కంటోన్మెంట్ అధికారులకు, తిరుమలగిరి మండల అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదంటూ జీవీ బాల్‌రాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.



వర్షానికి కూలిన వృద్ధురాలి ఇల్లు

## 12న అథ్లెటిక్స్ ట్రయల్స్

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** హైదరాబాద్ జిల్లా అథ్లెటిక్స్ ట్రయల్స్ ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్టు ఆ క్రీడా సంఘం తెలిపింది. ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో ఉదయం 6.30 గంటల నుంచి అండర్-14, 16, 18, 20 వయో విభా గాల్లో బాల బాలికలకు విడివిడిగా ట్రయల్స్ నిర్వహించనున్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారు ఈనెల 19, 20 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ మైదానంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో హైదరాబాద్ జిల్లా తరఫున పాల్గొంటారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నం. 9849048586ను సంప్రదించవచ్చు.

## సెల్‌ఫోన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురి అరెస్టు

- నిందితుల్లో ఇద్దరు మైనర్లు

**హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):** సులభంగా డబ్బు సంపాదించేందుకు సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు చేస్తున్న ముఠాలోని ప్రధాని నిందితుడితోపాటు ఇద్దరు మైనర్లను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. యాప్రాల్‌కు చెందిన బారియ రాకేష్ నాగరాజ్ యాదవ్ (19), మరో ఇద్దరు మైనర్‌లతో కలిసి సులభంగా డబ్బు సంపాదించేందుకు స్నాచింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. బైక్‌పై తిరుగుతూ కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి నుంచి మొబైల్ స్నాచ్ చేసి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులు నాగరాజు యాదవ్‌తోపాటు ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి మొబైల్‌తోపాటు స్నాచింగ్‌కు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

## తిరుమలగిరిలో వ్యక్తి అదృశ్యం

**తిరుమలగిరి సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):** వాకింగ్‌కు అని ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తిరుమలగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. జుపీటర్ కాలనీలోని రిట్జ్ అపార్ట్‌మెంట్ లో ప్రభుత్వ ఉద్యోగి రమేష్(51) తన అల్లుడు రిషీతో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 2వ తేదీన ఉదయం 9 గంటలకు వాకింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాలేదు బంధు మిత్రులను వాకబు చేసినా రమేష్ ఆచూకీ తెలియకపోవడంతో రిషీ బుధవారం తిరుమలగిరి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అదృశ్యమైన రమేష్

## గజాధర్ కులారియాకు ఎమ్మెల్యే తలసాని పరామర్శ

**రాంగోపాల్‌పేట్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):** గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన అఖిల భారత గోరక్షణ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గజాధర్ కులారియాను మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ బుధవారం పరామర్శించారు. రాంగోపాల్‌పేట్ డివిజన్ పాన్‌బజార్‌లోని గజాధర్ కులారియా నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తలసాని తెలుసుకున్నారు. ఎలాంటి ఆందోళన పడకుండా ధైర్యంగా ఉండాలని, వైద్యుల సూచనలు పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



కులారియాతో మాట్లాడుతున్న తలసాని శ్రీనివాస్ యాదవ్



ప్యారడైజ్ హోటల్ వద్ద రోడ్డు గుంతలను పూడ్చివేసిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## ప్యారడైజ్ వద్ద రోడ్లకు మరమ్మతులు

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి):** 'గుంతలమయంగా రహదారులు' అనే శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ యంత్రాంగం స్పందించింది. సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్ సమీపంలోని అధ్వాన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టింది. ప్యారడైజ్ హోటల్ పరిసరాల్లోని రహదారులు అధ్వానంగా ఉన్నాయని, మరమ్మతులు చేయ డంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆంధ్రజ్యోతి తన కథనం పేర్కొంది. దీనికి స్పందించిన జీహెచ్ఎంసీ బేగంపేట్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది ప్యారడైజ్ వచ్చి ప్యారడైజ్ హోటల్ సమీపంలోని రహదారులపై ఏర్పడిన గుంతలను పూడ్చి వేసి వాహనాల రాకపోకలు సాఫీగా సాగేలా చేశారు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో ప్రస్తుతానికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టామని, వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత శాశ్వత పనులు చేపడతామని అధికారులు పేర్కొన్నారు.



పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న శ్రీగణేష్

## మారేడుపల్లి పాలిటెక్నికల్ కళాశాలలో ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటుకు యత్నం

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి):** మారేడుపల్లిలోని పాలిటెక్నికల్ కళాశాల ఆవరణలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు యత్నిస్తానని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. కళాశాల ప్రిన్సిపల్, ఇతర అధ్యాపకులతో సమావేశమయ్యారు. కళాశాలలోని సమస్యలను వారిని అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. కళాశాల విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. అనంతరం శ్రీగణేష్ మాట్లాడుతూ, 18 వందల మంది విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యంలో శిక్షణనిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల ఈ నియోజకవర్గంలో ఉండటం తమ అదృష్టమన్నారు. ముఖ్యమంత్రితో మాట్లాడి పేద విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా కళాశాల ప్రాంగణంలోనే ఇంజినీరింగ్ కళాశాలను తీసుకువస్తానని హామీ ఇచ్చారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కాకి మాధవరావు, జస్టిస్ చంద్రకుమార్ తదితరులు

## పేదల సమస్యలపై మార్క్స్, అంబేడ్కర్ భావాలు ఒక్కటే

- ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు

**రాంనగర్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి):** పేదల సమస్యలు పరిష్కరించడానికి మార్క్స్, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భావాలు ఒక్కటేనని ఉమ్మడి రాష్ట్ర మాజీ చీఫ్ సెక్రటరీ కాకి మాధవరావు అన్నారు. యువత మార్క్స్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌లను స్ఫూర్తిగా తీసుకుని ముందడుగు వేయాలని సూచించారు. బుధవారం తెలంగాణ ప్రజా సాంస్కృతిక ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ రచయిత జి.రాములు రచించిన 'లాల్‌నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకి మాధవరావు పాల్గొని మాట్లాడారు. రచయిత 'లాల్ నీల్ స్ఫూర్తి ప్రదాతలు' పుస్తకంలో అనేక మంది ప్రముఖులకు సంబంధించిన స్ఫూర్తిదాయకమైన విషయాలను ప్రస్తావించడం అభినందనీయమన్నారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఎస్.వీరయ్య, ఎస్‌వీకే కార్యదర్శి ఎస్.వినయ్‌కుమార్, ప్రొఫెసర్ ననుమాస స్వామి, జిలకర శ్రీనివాస్, డాక్టర్ పసునూరి రవీందర్, కె.ఆనందాచారి, బీఎల్ఎఫ్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్, తంగిరాల చక్రవర్తి పాల్గొన్నారు.